దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి
- ప్రజావాణిలో అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ 7

ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ప్యానల్స్
- ప్రతిపాదనలకు ఆదేశించిన అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ 7






భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం



ముంపునకు గురైన సీతమ్మ వారి విగ్రహం

# ముసురేసింది

- ఉమ్మడి జిల్లాలో ఎడతెరిపిలేని వాన
- ఎగువ నుంచి వస్తున్న వరదతో ఉప్పొంగుతున్న వలు వాగులు
- దెబ్బతింటున్న రహదారులు.. చిత్తడవుతున్న అంతర్గత రోడ్లు
- జలకళ సంతరించుకుంటున్న చెరువులు

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 18 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం ముసురు వాన పడింది. ముఖ్యంగా మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా జల్లులు పడుతుండటంతో ఖమ్మం నగరంతోపాటు ఇతర ప్రాంతాల్లో జనం తిరగలేని పరిస్థితి. దీనికి తోడు వాతావరణం బాగా చల్లగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఖమ్మం జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 8.3 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. కల్లూరులో 27.6 మి.మీ, ఖమ్మంరూరల్ 17.6 మి.మీ, బోనకల్ 14.2 మి.మీ., ముదిగొండ, సత్తుపల్లి 12.8 మి.మీ., చింతకాని 11.4 మి.మీ., ఖమ్మంఅర్బన్ 10.2మి.మీ., చొప్పున వర్షపాతం నమోదైంది. మున్నేరు, ఆకేరు ఏర్లు పొంగి ప్రవహిస్తున్నాయి. వైరా, పాలేరు, లంకాసాగర్‌లో జలకళ కనిపిస్తోంది. పాలేరు జలాశయం 23 అడుగులకు గాను 22.2అడుగులు, వైరా రిజర్వాయర్ 18.3 అడుగులకు 18.11 అడుగులు, పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ 16 అడుగులకు గాను 15 అడుగుల వద్ద నీరు ఉంది. ఖమ్మం జిల్లాలో మొత్తం 1,061 చెరువులకు గాను 347 చెరువులు పూర్తిగా నిండాయి. మిగిలిన వాటికి నీరు చేరుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ రెండు రోజులుగా మోస్తరు వర్షాలు పడుతున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు అలుగులు పారుతున్నాయి. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 37.5 అడుగులు ఉండగా.. 39 అడుగులకు వరకు పెరిగే అవకాశం ఉందని (మిగతా 6వ పేజీలో)



పల్లిపాడునుంచి ఏన్కూరు వెళ్లే మార్గంలో పగిడేరు వాగు పొంగడంతో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్డు

## ధ్వంసమవుతున్న రోడ్లు

వర్షాలు, వాగులు ఉప్పొంగుతున్న కారణంగా ఉమ్మడి జిల్లాలోని పలు ఆర్ అండ్‌బీ, పీఆర్, మునిసిపల్ రహదారులు ధ్వంసమవుతున్నాయి. కొణిజర్ల మండలం పల్లిపాడునుంచి ఏన్కూరు వెళ్లే రహదారిలో పగిడేరువాగు,నిమ్మ వాగు పొంగడంతో రోడ్లు కొట్టుకుపోయాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వైరా, కూసుమంచి మండలాల్లో కూడా రోడ్లపై నీరు ప్రవహించిన చోట రోడ్లు దెబ్బతిన్నాయి. ఖమ్మం-సత్తుపల్లి, ఖమ్మం-బోనకల్, మధిర, ఖమ్మం-తిరుమలాయపాలెం, ఖమ్మం-ఇల్లెందు రహదారులతో పాటు పలుచోట్ల పంచాయతీరాజ్‌శాఖకు చెందిన రహదారులకు, మునిసిపల్ కార్పొరేషన్ రోడ్లలో నీరు నిలవడంతో గుంటలు పడ్డాయి రోడ్లపై నిలిచిన నీరును అధికారులు సత్వరం డ్రెయినేజీలలోకి వెళ్లేలా చర్యలు తీసుకోకపోవడంతో రోడ్లు దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● యూరియా వెతలు



యూరియా కోసం సోమవారం ఉదయాన్నే తల్లాడ సొసైటీ కార్యాలయానికి తరలివచ్చిన రైతులు

## ఆకేరు, మున్నేరుపై సోలార్ సీసీ కెమెరాలు

- వరదల అంచనాకు కొలత ప్రాంతాల్లో ఏర్పాటు
- ఖమ్మం కలెక్టర్ అనుదీప్ వినూత్న ప్రయత్నం



సీసీ కెమెరాలో వరద పరిస్థితి పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇప్పటి వరకు శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం ఉపయోగపడుతున్న సీసీ కెమేరాలు.. ఇకపై వరదల అంచనా వేయడం, విపత్తుల పరిస్థితిని అంచనా తెలుసుకునేందుకు కూడా ఉపయోగపడనున్నాయి. గతేడాది పరివాహకంలో కురిసిన అకాలవర్షంతో మున్నేరు, ఆకేరు ఉప్పొంగి ప్రవాహం ద్వారా ఖమ్మం నగరంతో పాటు అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి.. భారీ వర్షాలు, ఆకస్మికంగా వచ్చే వరదలను గుర్తించేందుకు సీసీ కెమేరాలను ఏర్పాటుచేసే వినూత్న ప్రయత్నానికిశ్రీకారం చుట్టారు. మున్నేరు, ఆకేరు పరివాహకంలో సోలార్‌తో పనిచేసేలా సీసీ కెమేరాలను తిరుమలాయపాలెం మండలంలోని ఆకేరువద్ద తిప్పారెడ్డిగూడెం, మున్నేరుపై డోర్నకల్ వద్ద ఏర్పాటు చేశారు. డే అండ్ నైట్ విజన్‌తో పనిచేసే వీటిని ఖమ్మం కంట్రోల్‌రూంతో పాటు సంబంధిత జిల్లా అధికారుల ఫోన్లకు అనుసంధానం చేశారు. ఎగువన వర్షాలు పడుతున్నప్పుడు నీటి ప్రవాహాన్ని సీసీకెమేరాల ద్వారా తెలుసుకుని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ముంపు ప్రాంతాల ప్రజలను కూడా ముందుగానే తరలించవచ్చని క్షేత్రస్థాయిలో పరిస్థితిని, నీటి ప్రవాహాన్ని అంచనా వేయవచ్చని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. తద్వారా వరదల వల్ల ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చూడవచ్చని తెలిపారు. ఖమ్మం కాల్వొడ్డు వద్ద కూడా ఈ సోలార్ కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నామని , వరద కొలతల వద్ద కూడా ఈకెమేరాలు ఉంటాయన్నారు. కలెక్టర్ అనుదీప్ సోమవారం సాయంత్రం ఈ సీసీకెమేరాల పనితీరును కలెక్టరేట్ నుంచి పరిశీలించారు. ఇవి 24గంటల పాటు పనిచేస్తాయని, వీటి ద్వారా వరద ఉధృతిని ఎప్పటికప్పుడు కలెక్టరేట్ కంట్రోల్ రూం నుంచి తెలుసుకోవచ్చని తెలిపారు. ఖమ్మం కాల్వొడ్డులో కూడా ఈ సోలార్ కెమేరా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేదల కలలను నిజం చేస్తున్నాం

- భద్రాద్రి రాముడి సాక్షిగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం
- 21న బెండాలపాడు రానున్న సీఎంకు లక్షమందితో స్వాగతం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రేవంత్ పర్యటనపై అధికారులతో సమీక్ష
- హెలీప్యాడ్, సభాస్థలం పరిశీలన



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

చంద్రుగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాము పేదల కలలను నిజం చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ నెల 21న ఆ భద్రాద్రి రాముడి సాక్షిగా చంద్రుగొండ మండలం బెండాలపాడులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనువాసరెడ్డి పేర్కొన్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం బెండాలపాడు వచ్చిన ఆయన పలువురు ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ముగిసేవరకు ప్రతి శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతంచేయాలనికోరారు. అనంతరం చంద్రుగొండ మండలం దామరచర్లలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, బహిరంగ సభా స్థలిని పరిశీలించి భద్రాత ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పొంగులేటి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లుగా ఇళ్ల కోసం పేదలు కన్నకలలు కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తోందని, (మిగతా 6వ పేజీలో)

## యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్న నిల్వలపై నిఘా ఉంచాలి
- అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ఆదేశాలు
- హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్సు ద్వారా సమీక్ష
- రైతులు ప్రస్తుత అవసరాల మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని సూచన






హైదరాబాద్ నుంచి వీసీలో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల, ఖమ్మంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఖమ్మం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వానాకాలం పంట సాగుకు అవసరమైన యూరియాను రైతులకు అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాదులోని సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఎరువుల సరఫరాపై సమీక్షించారు. జిల్లాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. మే చివరి వారంలో వర్షాలు ప్రారంభం కావడం, జూలై, ఆగస్టు నెలల్లో విస్తారంగా వానలు పడటంతో రైతులు పత్తి, వరి, మొక్కజొన్న లాంటి పంటలను ఒకేసారి సాగు చేశారని, రాష్ట్రంలో ఉన్న 2లక్షల మెట్రిక్ టన్నుల బఫర్‌స్టాక్ రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాబోయే 15 రోజులపాటు యూరియా అవసరాలపై కలెక్టర్లు, అధికారులు మండల స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, అవసరం ఉన్న చోటకు యూరియా తరలించాలన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలపై నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు స్టాకు వివరాలు తెలుసుకోవాలన్నారు. యూరియా ఎక్కడా పక్కదారి పట్టకుండా చూడాలని, రైతులు కూడా అధికంగా స్టాకు పెట్టుకోవద్దని, ప్రస్తుత తమ అవసరాల మేరకే తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు అదనంగా రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా యూరియా ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, పంపిణీ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. డిమాండ్ ఉన్న మండలాలకు మాత్రమే యూరియా పంపిస్తున్నామన్నారు. అదేవిధంగా ఈ వీసీలో ఖమ్మం జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, సహకారశాఖ అధికారి గంగాధర్, మార్కెటింగ్ శాఖ అధికారి అలీం, మార్క్‌ఫెడ్ అధికారి సునిత తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తొలగిస్తారా?

- వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు తమ్మినేని

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తొలగించేలా పాలకులు వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెంలోని మంచికంటిభవన్‌లో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిహార్‌లో త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేస్తారనే అనుమానంతో అనేకమంది ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమైందని, రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాయడంపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రభుత్వం పని చేస్తోందని ఆరోపించారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ తొలగించే పనిలో ఎలక్షన్ కమిషన్ ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి సానుకూలంగా ఎలక్షన్ కమిషన్ ప్రకటనలు ఇచ్చే విధానానికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. నకిలీ ఓట్ల తొలగింపు పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పనిని చేపడుతుందని విమర్శించారు. అమెరికాతో భారత్‌కు మంచి సంబంధాలు ఉంటే అమెరికా అధ్యక్షుడు భారత్‌పై సుంకాలు ఎందుకు విధిస్తున్నారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాణిజ్య రంగంలో సుంకాలు విధిస్తున్న అమెరికా విధానాలపై ప్రధాని నోరు మెదపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో భారీగా కురుస్తున్న వర్షాలకారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ మిడియం బాబురావు, సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గసభ్యుడు పోతినేని సుదర్శన్, బండారి రవికుమార్ పాల్గొన్నారు.


చేపపిల్లల సరఫరాకు గ్రీన్‌సిగ్నల్

- టెండర్లు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ
- మూడునెలలు ఆలస్యంగా ప్రభుత్వం నిర్ణయం 6




వైరాలోని మత్స్య విత్తనోత్పత్తి కేంద్రం



కల్లూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల


ఇద్దరు వంట సిబ్బందిపై బదిలీ వేటు

- కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాల ఘటనలపై అధికారుల చర్యలు
- విద్యార్థినుల అస్వస్థత, ఆరోగ్యంపై కలెక్టర్ ఆరా
- పరీక్షలకు ఆహార, తాగునీటి నమూనాలు 6

చిరునోములలో వరుస చోరీలు

- ఇంట్లో 3తులాల బంగారం, నగదు అపహరణ 7

గుండెపోటులో యువరైతు హఠాన్మరణం

# యూరియా కోసం రైతుల పాట్లు

- తల్లాడలో క్యూ కట్టిన అన్నదాతలు
- ఏన్కూరులో సరిపడా బస్తాలు కావాలని ఆందోళన
- వైరా, బూర్గంపాడు మండలంలోనూ అదే పరిస్థితి

ఉమ్మడి జిల్లాలో సోమవారం అన్నదాతలు యూరియా కోసం పాట్లుపడ్డారు. ఉదయాన్నే సొసైటీ కార్యాలయాలకు చేరుకుని యూరియా కోసం క్యూ కట్టారు. కొన్ని చోట్ల సరిపడా మందుకట్టలు ఇవ్వాలని ఆందోళన చేశారు. వైరా, తల్లాడ, ఏన్కూరు, కరకగూడెం, బూర్గంపాడు మండలాల్లో ఈ దృశ్యం కనిపించింది.


బూర్గంపాడులో గోదాము వద్ద రైతులు

వైరా/తల్లాడ/ఏన్కూరు/కరకగూడెం/బూర్గంపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో యూరియా కోసం అన్నదాతలు తీవ్ర అగచాట్లకు గురవుతున్నారు. సహకార సంఘాలకు అరకొరగా వచ్చే యూరియా కోసం రోజుల తరబడి ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక్కో రైతుకు ఒకటి రెండు బస్తాలు మాత్రమే అందుతోంది. పూసలపాడు సొసైటీలో ఉన్న పూసలపాడు, నారపనేనిపల్లి, గౌండ్లపాలెం గ్రామాల నుంచి వందలాదిమంది రైతులు యూరియా కోసం సొసైటీ కార్యాలయానికి చేరుకున్నారు. కేవలం 200 బస్తాల యూరియా మాత్రమే రావడంతో ఉన్న మేరకు పంపిణీ చేశారు. మిగిలిన రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. వైరా ఎస్‌ఐ పి.రామారావు, ట్రెయినీ ఎస్‌ఐ వెంపటి పవన్ గొల్లపూడి చేరుకొని పంపిణీ సజావుగా సాగేలా చూశారు.

### తల్లాడ సొసైటీ కార్యాలయంలో రైతుల క్యూ

యూరియా కోసం వేకువజామునే రైతులు సొసైటీ కార్యాలయంలో క్యూకట్టారు. వర్షంలో రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. యూరియా వచ్చిందన్న సమాచారం తెలుసుకున్న రైతులు సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకే తల్లాడ సొసైటీ కార్యాలయానికి మండలంలోని కొత్త వెంకటగిరి, రామచంద్రాపురం, బిల్లుపాడు, పినపాక, రెడ్డిగూడెం, మల్లారం, నారాయణపురం, గొల్లగూడెం, అన్నారుగూడెం, బాలపేట, గోపాలపేట, గంగదేవిపాడు గ్రామాల నుంచి సుమారు వెయ్యి మంది రైతులు వచ్చారు. 900మంది రైతులకు కూపన్లు


పూసలపాడు సొసైటీకి యూరియా కోసం తరలివచ్చిన రైతులు

పంపిణీ చేశారు. వీరిలో కేవలం 250 మంది రైతులకు మాత్రమే ఒక్కొక్క రైతుకు ఒక్కో బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు. కూపన్లు తీసుకున్న మిగిలిన 650 మంది రైతులకు మంగళ, బుధవారాల్లో యూరియా పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ సొసైటీ అధికారులు తెలిపారు.

### ఏన్కూరులో యూరియా కోసం ఎగబడ్డ రైతులు

యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. సోమవారం ఉదయం ఏన్కూరు సొసైటీ కార్యాలయం ఎదుట రైతులు యూరియా కోసం పెద్దఎత్తున హాజరయ్యారు. సరిపడా యూరియా బస్తాలు కావాలని ఆందోళన చేశారు. సొసైటీ అధికారులు ఒక రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తామని చెప్పడంతో రైతులు అసహనానికి గురయ్యారు. తర్వాత పోలీసులు జోక్యంతో క్యూ పద్ధతిలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు.

### యూరియా కోసం ఆందోళన చెందొద్దు

**మిరియాల నాగలక్ష్మి, సొసైటీ సీఈవో**

యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు. ప్రతిరోజు రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నాం. రైతులు ముందస్తుగా ఎక్కువ స్టాకు చేసుకోవడం వల్లే ఈ సమస్య. ఇప్పటి వరకు 6089 బస్తాల యూరియా రైతులకు పంపిణీ చేశాం. ప్రతిరోజు 335 బస్తాల యూరియా పంపిణీ చేస్తున్నాం.

### వర్షంలో కరకగూడెం సబ్ సెంటర్ వద్ద రైతుల పడిగాపులు

రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం సబ్ సెంటర్‌కు రైతులు వర్షంలోనూ తరలి వచ్చారు. రైతుకు రెండు కట్టలు మాత్రమే ఇస్తున్నారు. అంతేకాక పీవోఎస్ మిషన్ ద్వారా యూరియా ఇవ్వడంతో యూరియా ఇవ్వడం సమయం పడుతుందని రైతులు వాపోతున్నారు.

### బూర్గంపాడులో...

వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో యూరియా కోసం రైతులు నానా పాట్లు పడుతున్నారు. సోమవారం బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాము వద్దకు రైతులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. చాలినంత యూరియా లేకపోవడంతో ఆందోళన చేశారు.స్టాకు ఉన్న బస్తాలను రైతులకు సర్ది ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.


ఏన్కూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు


కరకగూడెం సబ్ సెంటర్ వద్ద గొడుగులతో రైతులు

# పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మామిడిగుండాల సీలింగ్ భూముల సమస్యలకు త్వరలో పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ఇల్లెందులో మంత్రి పొంగులేటికి స్వాగతం, పక్కన ఎమ్మెల్యేలు


టేకులపల్లి మండలంలో రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఇల్లెందు/టేకులపల్లి ఆగస్టు 18, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ గృహనిర్మాణ పథకాలు మరో మూడు విడతలుగా మంజూరు చేస్తామని, అర్హులందరికీ పక్కా గృహాలు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మంత్రి ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో రూ.22.6కోట్లతో చేపట్టనున్న పలు పథకాలకు శంకుస్థాపనలు చేశారు. ఇల్లెందు మండలంలోని మేడికుంట-రామచంద్రాపురం వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ గృహనిర్మాణ పథకాలు అర్హులందరికీ మంజూరు చేస్తామని ఎవరూ అధైర్యపడవద్దన్నారు. మామిడిగుండాల ఏరియాలో దశాబ్దాలకాలంగా సీలింగ్ భూముల సమస్యలతో గిరిజనులు నష్టపోతున్నారని స్థానికులు వివరించడంతో స్పందించిన మంత్రి సీలింగ్ భూముల సమస్యలు తన దృష్టికి వచ్చాయని త్వరలోనే సీలింగ్ భూముల వివాదాలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని హామీఇచ్చారు. అంతకుముందు ఇల్లెందు మండలంలో మేడికుంట వంతెన నిర్మాణం ఇల్లెందులో మినీస్టేడియం పెండింగ్ పనులకు, సుభాష్‌నగర్ పంచాయతీలో లలితాపురం వద్ద బీటీరోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, రాందాస్ నాయక్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు.

### జడివానలో పొంగులేటి పర్యటన

మంత్రి పొంగులేటి ఇల్లెందు నియోజకవర్గంలో సోమవారం జడివానలోనే పలు కార్యక్రమాలకు భూమి పుజలు నిర్వహించారు. తొలుత టేకులపల్లి మండలం రాంపురంలో లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు, కోక్యతండా-పాత తడికెలపూడి బీటీరోడ్డు, శ్లాబ్ కల్వర్టుల నిర్మాణ పనులకు పెట్రాంచెలక హైలెవల్ బ్రిడ్జి పనులకు కిష్టారం గ్రామంలో హైలెవల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు మంత్రి పొంగులేటికి ఇల్లెందు మాజీ మునిసిపల్ ఛైర్మెన్‌లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదల్లపల్లి అనసూర్య, మాజీ మునిసిపల్ వైస్‌ఛైర్మెన్ మడత వెంకట్‌గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాంబాబు, మండల, పట్టణ అధ్యక్షులు పులిసైదులు, దొడ్డ డానియేల్, హరిహర క్షేత్రం ఛైర్మెన్ గందె సదానందం, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు..

### టేకులపల్లి మండలంలో

వానజల్లును సైతం లెక్కచేయకుండా సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలో పర్యటించి రూ.11కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మండలంలోని పాతతండా-రాంపురం గ్రామాల మధ్య రాళ్లవాగుపై రూ2.50కోట్లతో మంజూరైన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు, తావుర్యాతండా నుంచి కోక్యాతండా మీదుగా పాత తడికలపూడి వరకు రూ3.53కోట్ల వ్యయంతో మంజూరైన చప్టా, బీటీ రోడ్డు నిర్మాణాలకు, పెట్రాంచెల్క-స్టేజీ- పెట్రాంచెల్క గ్రామాల మధ్య వాగుపై రూ2కోట్లతో మంజూరైన హైలెవెల్ వంతెన నిర్మాణం పనులకు, కిష్టారం గ్రామంలో ముర్రేడువాగుపై రూ3కోట్లతో మంజూరైన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. తావుర్యాతండా గ్రామ సమీపంలో ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇల్లెందు, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోతు రాందాసునాయక్, పీఏసీఎస్ ఛైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఇల్లెందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోతు రాంబాబు, ఆత్మకమిటీ ఛైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కొత్తగూడెం ఆర్డీవో, తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీవో మల్లేశ్వరి, పంచాయతీరాజ్ డీఈ రాంకిషన్, ఏఈ నవీన్ పాల్గొన్నారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు
# నిబంధనలు పాటించాలి

**ఎస్పీ రోహిత్‌రాజు**

కొత్తగూడెం సాంస్కృతికం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల ఉత్సవ మండపాల నిర్వాహకులు పోలీస్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పోలీస్ శాఖ ఆన్‌లైన్ ద్వారానే మండపాల నిర్వహణకు అనుమతి మంజూరు చేస్తుందని, అనుమతి లభించిన తర్వాతే వినాయక మండపం ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. సోమవారం ఎస్పీ ఓ ప్రకటనను విడుదల చేశారు. తెలంగాణ పోలీస్‌శాఖ రూపొందించిన పోర్టల్https://policeportal.tspolice.gov.inకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాభద్రత, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులభంగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

### గణేష్ ఉత్సవ కమిటీలు పాటించాల్సిన నియమ నిబంధనలు..

ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గణేష్ మండపాలు ఎవరికీ ఆటంకం లేకుండ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల కమిటీ వివరాలు, ఫోన్ నెంబర్లు మండపంలో ఏర్పాటు చేయాలన్నారు.రాత్రి 10గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు. మండపం వద్ద 24గంటలు వలంటీర్లు ఉండాలన్నారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందుజాగ్రత్తగా దగ్గరలో ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

## ముత్తంగి అలంకారంలో రామయ్య



భద్రాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో భక్తులు స్వామివారిని దర్శించి పులకించారు. ఇదిలాఉండగా రామయ్యకు నిత్యకల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యోకధారణ, యజ్ఞోపవీతధారణ, శుభ ముహూర్తం, జీలకర్రబెల్లం, తలంబ్రాలు, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనంతో కల్యాణ ప్రక్రియ ముగిసింది.

## రామకృష్ణాపురం రైల్వే బ్రిడ్జిపై కదలిక

**ఎంపీ వద్దిరాజు లేఖకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి స్పందన**

ఖమ్మం మార్కెట్/చింతకాని, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండల పరిధిలోని రామకృష్ణాపురం రైల్వే క్రాసింగ్ (107) వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్థులు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలసి ఇటీవల వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఎంపీ ఆగస్టు 7న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశాడు. 107 రైల్వే క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆర్వోబీ నిర్మాణంపై సాధ్యాసాధ్యలను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని రైల్వే ఉన్నతాధికారులను ఆదేశించడం జరిగిందని ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు బదులు లేఖను పంపారు. తమ ఇబ్బందులను కేంద్ర రైల్వేశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థిని దూషించిన ఆటో డ్రైవర్

ఖమ్మంక్రైం, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): ఆటోఎక్కిన డిగ్రీ విద్యార్థిని డ్రైవర్ దూషించిన ఘటన సోమవారం సాయంత్రం నగరంలో జరిగింది. సదరు విద్యార్థి వివరాల ప్రకారం.. ఇల్లెందు ప్రాంతానికి చెందిన నిమ్మల జీవన్ నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. సోమవారం ఇంటికి వెళ్లేందుకు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఆటోను ఎక్కాడు. డబ్బులు ఫోన్‌పేద్వారా చెల్లిస్తానని చెప్పాడు. ఈక్రమంలో మద్యంమత్తులో ఉన్న ఆటోడ్రైవర్ సదరు విద్యార్థిని దూషించాడు. రూ.50 ఉన్నాయని చెప్పినా.. చిల్లర పెట్టుకోవాలంటూ మరోసారి గొడవకు దిగాడు. ఆటో ఆపకుండా మద్యం మత్తులో డివైడర్ ఢీకొట్టబోయాడని వివరించాడు. వెంటనే బాధిత విద్యార్థి డయల్ 100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. వారు సమీపంలోని పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిపాడు.

# పేదల కలలను నిజం చేస్తున్నాం

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల సమయంలోనే ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పేదలందరికీ గృహాలు కట్టించే ప్రక్రియ చేపట్టిందన్నారు. ఈ క్రమంలోనే భద్రాద్రి రాముని సన్నిధిలో ఈ పథకాన్ని ప్రారంభించామని, తిరిగి అదే భద్రాద్రి జిల్లాలోని బెండాలపాడులో పూర్తయిన ఇళ్లను ముఖ్యమంత్రి గృహప్రవేశం చేయించడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తున్నామని, పైలెట్ ప్రాజెక్టు కింద బెండాలపాడులో నిర్మిస్తున్న 312 ఇళ్లలో 72 ఇళ్లు పూర్తయ్యాయని, రాష్ట్రంలో బెండాలపాడు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

### లక్ష మందితో స్వాగత సభ

ఆశ్వారావుపేట, పినపాక, భద్రాచలం, సత్తుపల్లి, ఇల్లెందు ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి పొంగులేటి దామరచర్లలో పలు మండలాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ లక్ష మందితో సీఎం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రుగొండకు 30కిలో మీటర్ల పరిధిలోని మండలాల నుంచి లబ్ధిదారులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని, అందుకు క్షేత్రస్థాయి కార్యకర్త నుంచి ఎమ్మెల్యేల వరకు బాధ్యత తీసుకోవాలని కోరారు. సీఎం పర్యటించే సమయంలో బెండాలపాడులోకి బయట వ్యక్తులను అనుమతించ వద్దని మంత్రి, కలెక్టర్ పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. గ్రామానికి వచ్చే పోయే రహదారితో పాటు గ్రామంలోని అంతర్గత రోడ్లు ఇరుకుగా ఉన్నాయని దాంతో ట్రాఫిక్ సమస్యతో పాటు భద్రతా సమస్యలు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావ్, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ విజయబాబు, కలెక్టర్, ఎస్పీతో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సీఎం ప్రారంభించే ఇంటిని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

### సీఎం పర్యటన వివరాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 21న హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు చంద్రుగొండలోని హెలిప్యాడ్ చేరుకుంటారు. అక్కడి నుంచి 2.10కి బెండాలపాడు చేరుకొని 2.20కి సీఎం ప్రారంభించే గృహాల వద్ద పూజలు నిర్వహిస్తారు. ఒక్కో ఇంటివద్ద 15నిమిషాలు లబ్ధిదారులతో మాట్లాడుతారు. అనంతరం 2.50కి బెండాలపాడు నుంచి బయలుదేరి సాయిత్రం 3గంటలకు దామరచర్లలో జరిగే బహిరంగ సభకు చేరుకుంటారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.

## చేపపిల్లల సరఫరాకు
# గ్రీన్‌సిగ్నల్

వైరా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఆలస్యంగానైనా ప్రభుత్వం రాష్ట్రంలో ఉచిత చేపపిల్లల సరఫరాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎట్టకేలకు సోమవారం టెండర్లు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. వాస్తవానికి మే, జూన్ నెలల్లోనే టెండర్లు ఆహ్వానించి చేపపిల్లల సరఫరాదారులతో ఒప్పంద ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది. ఇదే అంశంపై జూలై మూడో తేదీన ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో 'మీన మేదీ' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అయితే మూడునెలలు ఆలస్యంగా రాష్ట్రంలో ఉచిత చేపపిల్లల సరఫరాకు సంబంధించి సరఫరదారుల టెండర్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. సెప్టెంబరు ఒకటోతేదీన సరఫరాదారుల నుంచి వచ్చిన టెండర్లను పరిశీలించి వారి అర్హతలను బట్టి ఖరారు చేయనున్నారు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఛైర్మన్‌గా, జిల్లా మత్స్యశాఖ అధికారి మెంబర్ కన్వీనర్‌గా, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి, ఈడీఎం మెంబర్లుగా, ఈ ప్రొక్యూర్‌మెంట్ కమిటీగా వ్యవహరిస్తారు. ఖమ్మం జిల్లాలో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు 882ఉన్నాయి. వీటన్నింటికీ 3.49కోట్ల ఉచిత చేపపిల్లలను సరఫరా చేస్తారు. వీటిలో 80నుంచి 100మిల్లీమీటర్లు సైజు కలిగిన 2.15కోట్ల చేపపిల్లలు, 35నుంచి 40మిల్లీమీటర్ల సైజు కలిగిన 1.34కోట్ల ఉచిత చేపపిల్లలను చెరువులు, కుంటల్లో విడుదల చేస్తారు. ఆలస్యంగానైనా తమను గుర్తించి ఉచిత చేపపిల్లల సరఫరాకు టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమైంది.

# ముసురేసింది..


పర్ణశాల స్నానఘట్టాల వద్ద వరద ఉధృతి

(5వ పేజీ తరువాయి)

అధికారులు చెబుతున్నారు. భద్రాచలంలోని స్నాన ఘట్టాలు నీట మునగడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం సీఐ నాగరాజు తమ సిబ్బందితో సందర్శించి చేపట్టిన చర్యలను పరిశీలించారు. ఇదే సమయంలో మైకు ద్వారా భక్తులు గోదావరిలోకి దిగవద్దంటూ పోలీసులు, గజ ఈతగాళ్లు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దుమ్ముగూడెం మండలం పర్ణశాల నారచీరల ప్రాంతం మునిగింది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు పదిగేట్లు ఎత్తి 24వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పాల్వంచలోని కిన్నెరసాని రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407అడుగులు కాగా ప్రస్తుతం 404 అడుగులకు చేరింది. సోమవారం పడిన వర్షానికి మణుగూరు మండలంలోని పగిడేరు రామానుజవరం గ్రామ లింకురోడ్డుపై వాగు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు. కాగా జిల్లాలోని పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో 5.5సెంమీ, అశ్వాపురంలో 4.53, మణుగూరులో 4.5, దుమ్ముగూడెంలో 3, కరకగూడెంలో 2.68, ముల్కలపల్లిలో 1.68, బూర్గంపాడులో 1.45, చర్లలో 1.28, గుండాలో 1.15, దమ్మపేట, ఆళ్లపల్లిలో 1 సెంమీ వర్షపాతం నమోదైంది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని దమ్మపేట మండలం మందలపల్లి గాంధీనగరం మధ్యలో ప్రధాన రహదారి కోతకు గురైంది.


మైకు ద్వారా గోదావరిలోకి దిగొద్దని హెచ్చరిస్తున్న పోలీసులు

## యూరియా కోసం బారులు తీరుతున్న రైతులు

వర్షాలతో సాగు పనులు ముమ్మరం కావడం, ముసురు వీడగానే పంటలకు ఎరువులు వేయాల్సి ఉండటంతో రైతులు యూరియా కోసం సొసైటీల వద్ద బారులు తీరుతున్నారు. సొసైటీ కార్యాలయాలు, ఎరువుల డీలర్ల వద్దకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 4 లక్షలపైగా ఎకరాల్లో పంటలు వేశారు. పత్తి, వరి, మొక్కజొన్నతో పాటు కూరగాయలు, తదితర పంటలకు యూరియా వేసే సమయం ఆసన్నమైంది. దీంతో జిల్లాలో ప్రతిరోజు ఏదో ఒక మండల కేంద్రంలో రైతులు బారులు తీరుతున్నారు కొందరు తర్వాత దొరుకుతుందో లేదోనన్న భయంతో ఎక్కువ మొత్తం కొనుగోలుచేసి నిల్వ ఉంచుకుంటున్నారు.

### రైతులు కంగారుపడొద్దు

**ధనసరి పుల్లయ్య, ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి**

జిల్లాలో ఎరువుల కొరత లేదు. కంగారు పడాల్సిన అవసరం లేదు. గతేడాది ఏప్రిల్‌నుంచి ఆగస్టు 15వరకు18వేల మె.ట.యూరియా ఖమ్మం జిల్లాలో వినియోగించాం. ఈ ఏడాది ఇప్పటికే 21వేల మె.ట. యూరియా రైతులకు అందించాం. ప్రస్తుతం 2,394మె.ట. యూరియా అందుబాటులో ఉంది. మరో రెండురోజుల్లో వెయ్యి మె.ట.ర్యాక్ రాబోతుంది. కొందరు అవసరం ఉన్నా లేకపోయినా ముందుగానే ఎరువులుకొనాలని వస్తున్నారు. ప్రస్తుత అవసరాలకు ఎరువులు కొనుగోలు చేస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది.

## ఇద్దరు వంట సిబ్బందిపై
# బదిలీ వేటు

- కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాల ఘటనలపై అధికారుల చర్యలు
- విద్యార్థినుల అస్వస్థత, ఆరోగ్యంపై కలెక్టర్ ఆరా
- పరీక్షలకు ఆహార, తాగునీటి నమూనాలు

కల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కల్లూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనలకు కారకులైన వసతి గృహంలోని ఆహార తయారీదారులైన ఇద్దరు సిబ్బందిపై బదిలీవేటు పడింది. కలెక్టర్ అనుదీప్ కూడా అస్వస్థత ఘటనలపై ఆరా తీశారు. ఇప్పటికే ఈ పాఠశాలలో ఈ నెల 5, 6 తేదీల్లో 38మంది విద్యార్థినులు ఉడికి ఉడకని అన్నం తిని అస్వస్థతకు గురవగా.. మళ్లీ ఆదివారం 15మంది విద్యార్థినులు అల్పాహారంగా పకోడీ తిని అస్వస్థతకు గురయ్యారు. ఇంత జరుగుతున్నా ఇంత వరకు సమగ్ర విచారణ జరపని పరిస్థితి ఉండటంతో విద్యార్థినులు తల్లిదండ్రులు తీవ్రఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆహారం తయారీ, వినియోగించే సరుకులు, కూరగాయల్లో నాణ్యత లేదని, చివరకు వడ్డించే విషయంలోనూ సిబ్బంది, పర్యవేక్షకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే వసతి గృహంలో పదిహేను రోజుల క్రితం వార్డెన్ సస్పెన్షన్‌కు గురవగా.. తాజాఘటనలో బాధ్యులను చేస్తూ ఈ వసతి గృహంలో పనిచేస్తున్న వంట తయారీ సిబ్బందిలో ఇద్దరిని సత్తుపల్లికి బదిలీ చేయడంతో పాటు వారి స్థానంలో సత్తుపల్లి సిబ్బందిని ఇక్కడకు బదిలీ చేస్తూ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. అయితే పాఠశాలలో అందిస్తున్న ఆహార పదార్థాలతో పాటు తాగునీటి నాణ్యత నిర్ధారణ కోసం శ్యాంపిళ్లను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపనున్నట్టు తెలిసింది. ఈ పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు సుమారు 100 మంది ఉండగా, పాఠశాల, వసతిగృహానికి కలిపి అనుసంధానంగా రేండే భవనాలున్నాయి. దీంతో నిర్వహణ కష్టతరంగా మారి.. పరిసరాల పరిశుభ్రత లేకుండా పోయిందని, ఫలితంగా విద్యార్థినులు అనారోగ్యం పాలవుతున్నారన్న విమర్శలున్నాయి. జిల్లా యంత్రాంగం దృష్టిపెట్టాలని, ప్రత్యామ్నాయంగా కొత్త భవనాలను నిర్మించాలిన్న డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.






**50 ఏళ్లుగా ఆరు వేల మందికి శిక్షణ...**

**భద్రాద్రి జిల్లా ఫొటో, వీడియో గ్రాఫిక్ ప్రముఖ శిక్షకుడు కేసీఎస్ రావు**

**ప్రస్తుతం ఆదరణ లేక గుర్తింపు కరువు**

చుంచుపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఒక చిత్రం... ఒక సందేశం... ఎన్నో అర్థాలకు చిరునామా..! ఒక చిత్రం తీయని జ్ఞాపకం... జరిగిపోయిన సంఘటనలకు ఆనవాళ్లుగా... సాక్ష్యాలుగా (ఫొటో) నిలుస్తుంది. చరిత్రలో నిలిచిపోయే దృశ్యాలను.. విలువైన ఎన్నో మధుర స్మృతులను ఎప్పటికీ కళ్ల ముందు ఉంచేది ఛాయా చిత్రం. కనిపించని అనుభూతులను తెలియజేస్తూ ప్రతి ఒక్కరినీ ఆకర్షింప చేసేది కేవలం ఫొటో మాత్రమే. ఈ ఫొటోగ్రఫీనే వృత్తిగా చేసుకున్న ఫొటోగ్రాఫర్లను ఏకంచేస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 19వ తేదీన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

**ఉపాధి అవకాశాలు మెండుగా...!**

ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో ఫొటోగ్రఫీతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రస్తుత రోజుల్లో నైపుణ్యం అందిపుచ్చుకొని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లుగా రాణించి జీవితాల్లో స్థిరపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫొటో అండ్ వీడియోగ్రాఫిక్‌పై ఆరు నెలల బ్రిడ్జి కోర్సులు సైతం భద్రాద్రి జిల్లాలోని రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులోకి తీసుకువచ్చారు. పలువురు నిరుద్యోగ అభ్యర్థులు ఈ కోర్సులను సద్వినియోగం చేసుకొని జీవనోపాధిగా మలుచుకున్నారు.

**50 ఏళ్లుగా శిక్షణ : కేసీఎస్ రావు**


ఆకాశవాణిలో సందేశాన్ని అందిస్తున్న కేసీఎస్ రావు

గతంలో ఫొటోగ్రాఫర్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితులు మారాయని ప్రముఖ భద్రాద్రి జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫిక్ శిక్షకుడు కె.చంద్రశేఖర్‌రావు (కే.సీ.ఎస్. రావు) స్పష్టం చేశారు. సుమారు 50 ఏళ్ల అనుభవంతో ఆరు వేల మందికిపైగా తన వద్ద శిక్షణ ఇచ్చారు. పాల్వంచలోని స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ సంస్థలో ఉద్యోగిగా 1978లో విధుల్లో చేరి 2000 సంవత్సరంలో పదవీ విరమణ పొందిన అనంతరం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిని చూపుతూ ఫొటోగ్రఫీలో శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం సినీరంగంతో పాటు వివిధ స్టూడియోల్లో తన శిష్యబృందం స్థిరపడినట్లు తెలిపారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలపై అనేక సార్లు ఆకాశవాణి కేంద్రంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించుకున్నానని ఆయన వెల్లడించారు.

**ఆదరణ లేక.. ఆర్థిక ఇబ్బందులు**

ఫొటోగ్రఫీ వృత్తికి ప్రస్తుత రోజుల్లో గుర్తింపు కరువైంది. తమ జీవితాలను నెట్టుకొచ్చేందుకు వారు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం అందరి చేతుల్లోనూ స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయని, సరదాగానో, సందర్భంగానో ఫొటోలు దిగుతున్నారు. ఈ క్రమంలో ఫొటోగ్రాఫర్స్ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఫొటోగ్రఫీ అనేది బ్లాక్ అండ్ వైట్ కాలం నుంచి మల్టీ కలర్‌కు మార్పులు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించి వారికి పెన్షన్, హెల్త్‌కార్డులు, బీమా సౌకర్యాలు, ఈఎస్ఐ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి

**ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**


ప్రజావాణిలో ఫిర్యాదు అందుకుంటున్న ఖమ్మం కలెక్టర్ అనుదీప్

ఖమ్మం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో పనిచేసే అన్నిశాఖల సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ సిస్టం ద్వారా హాజరు నమోదు చేయాలని అందరూ సమయపాలన పాటించాలన్నారు. డీఆర్వో, కలెక్టరేట్ ఏవో ప్రతిరోజు మానిటరింగ్ చేయాలని సూచించారు. జనవరి 1నుంచి ఇప్పటి వరకు మునిసిపల్ కార్పొరేషన్ వద్ద 37, విద్యాశాఖ అధికారి వద్ద 28, సర్వేల్యాండ్ రికార్డ్స్‌లో 26, ఎన్పీడీసీఎల్‌లో 22, జీజీఎస్ 17, వైద్యారోగ్య శాఖలో 8, పంచాయతీరాజ్ శాఖలో 7 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. ప్రజాప్రతినిధులు పంపే దరఖాస్తులకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలని లేకపోతే అందుకుగల కారణాలు, నిబంధనలు సూచించాలని తెలిపారు. ఖమ్మంరూరల్ మండలం మంగళగూడెంకు చెందిన కొప్పులు బుచ్చమ్మ తన భర్తనుండి వారసత్వంగా భూమిని తన పేరుపై నమోదు చేయడానికి కుమార్తెలు అడ్డుపడుతున్నారని, వృద్ధాప్యంలో ఉన్న తనను ఇబ్బంది పెడుతున్నారని తెలపగా కలెక్టర్ జిల్లా సంక్షేమాధికారిని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖమ్మంనగరానికి చెందిన జోగుపర్తి వెంకమ్మ తన ఇద్దరుకుమారులపై గతంలో ఫిర్యాదు చేశానని, గత కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను కుమారులు పాటించడంలేదని, తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరగా సీనియర్ సిటిజన్ సంరక్షణ చట్టం కింద అవార్డు అమలు చేయాలని సంక్షేమాధికారిని ఆదేశించారు. నేషనల్ యూనియన్ గ్రామీణ డాక్ సేవక్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి రాంప్రసాదరావు తపాలశాఖలో రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల అమలుకు కోరగా, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏవోను ఆదేశించారు. వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన పిల్లి సర్వేష్ దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని కోరగా ఇందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుండి వ్యక్తిగత, గ్రామ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో పద్మశ్రీ, జడ్పీసీఈవో దీక్షారైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వైరాలో చేపల ఉత్పత్తికి శ్రీకారం


చేపలకు ఓవాటైడ్ హార్మోన్ ఇంజక్షన్ చేస్తున్న డీఎఫ్‌వో శివప్రసాద్

వైరా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మత్స్య విత్తనోత్పత్తి కేంద్రంలో సోమవారం చేపపిల్లల ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. 14లక్షల చేపపిల్లల ఉత్పత్తే లక్ష్యంగా ప్రక్రియను చేపట్టారు. వైరా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, ఆ శాఖ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జి.శివప్రసాద్ చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించారు. ఈ చేపపిల్లల ఉత్పత్తి కోసం ప్రభుత్వం రూ.90వేల నిధులు మంజూరు చేసింది. సాధారణంగా జూలై నెలలో చేపపిల్లల ఉత్పత్తి చేపట్టాల్సిఉంది. అయితే వర్షాలు అనుకూలించక ఈ ప్రక్రియ ఆలస్యమైంది. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు వాతావరణం అనుకూలంగా ఉండటంతో చేపపిల్లల ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఇక్కడ చేపపిల్లల ఉత్పత్తి జరగటం లేదు. దాంతో హెచ్చరీస్ పైపులైన్లు, మోటర్లు నిరుపయోగంగా మారి శిథిలమయ్యాయి. ప్రస్తుతం వాటికి తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఒక ఆడ చేప రెండు మగ చేపలు (1:2) చొప్పున సమీకరించి చేపపిల్లల ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. కిలో సైజున్న మగ చేపకు 0.2ఎంఎల్, కిలో సైజు బరువున్న ఆడ చేపకు 0.4ఎంఎల్ హార్మోన్ ఇంజక్షన్ చేసి వాటిని హార్చరీలో వదిలారు. మొదటి దఫాగా ఐదు జతలను ఈ ప్రక్రియకు వినియోగించారు. శీలావతి (రోహు, రవ్వ)రకానికి చెందిన పిల్లల ఉత్పత్తి చేపట్టారు. మూడు రోజుల తర్వాత 2ఎంఎం సైజు ఉన్న చేపపిల్ల ఉత్పత్తి అవుతుంది. వాటిని సిమెంట్ లేక కచ్చా నర్సరీల్లో పోసి 35నుంచి 40ఎంఎం సైజు వరకు పెంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఉచితంగా సరఫరా చేస్తారు. దాదాపు 2ఎంఎం సైజు కలిగిన 45లక్షల చిప్పర చేపపిల్లల ద్వారా 14లక్షల చిరు చేపపిల్లలను (35నుంచి 40ఎంఎం సైజు) పెంచి వివిధ చెరువులకు సరఫరా చేస్తామని మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు.

## ఆదివాసీలను కాపాడుకుందాం..

**సంఘాల నేతలు**

ఇల్లెందు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కులు, ప్రాణాలు హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమనాల లక్ష్మయ్య, ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి మెంతెన సంజీవరావు పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లెందు బస్‌స్టాండ్ సెంటర్ వద్ద ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 24న వరంగల్లులో జరగనున్న వేదిక బహిరంగ సభ విజయవంతానికి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రామటెంకి అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి, ప్రజాఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ మెంతెన సంజీవరావు, ఆదివాసీ ట్రైబల్ ఫోరం రాష్ట్ర నాయకులు సువర్ణపాక నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఆదివాసీ ప్రజలపై, ప్రాంతాలపై, హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాగాన్ని ఉల్లంఘిస్తూ, వారి హక్కులను కాలరాస్తూ.. ప్రశ్నించిన ఆదివాసీ ప్రజలపై ఉక్కుపాదం మోపుతూ, వారిని నక్సలైట్ల పేరుతో హననం చేస్తున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడుస్తూ ఆదివాసీ జాతి హననాన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్నటువంటి లక్షల, కోట్ల విలువైన ఖనిజ సంపదను దోచుకెళుతున్న పెట్టుబడిదారీ వర్గాలకు వ్యతిరేకంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రలతో పాటు జాతీయ స్థాయిలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నిర్మాణం కావడం జరిగిందన్నారు. వేదిక ఆధ్వర్యంలో వరంగల్ కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఈ నెల 24న జరగనున్న బహిరంగ సభకు ఆదివాసీలు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు తరలిరావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ట్రైబల్ ఫోరం మోకాళ్ల రమేష్, తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి ప్రశాంత్, లక్పతి, తుడుందెబ్బ నాయకులు వట్టం కన్నయ్య, పెనక మంగయ్య, సువర్ణపాక రామారావు, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు రేసుబోసు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు రాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ప్యానల్స్

**ప్రతిపాదనలకు ఆదేశించిన ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ**

ఖమ్మం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు జిల్లాలో ఉన్న ప్రభుత్వ కార్యాలయ భవనాలపై సోలార్‌ప్యానల్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మరో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి విద్యుత్ బిల్లుల వివరాలు, రూఫ్‌టాప్ ఏరియా, బిల్డింగ్ కాల పరిమితి, తదితర సమాచారాలు నిర్ణీత ఫార్మాట్‌లో అందించాలన్నారు. జిల్లాలో 4700 పైగా ప్రభుత్వ కార్యాలయాలున్నాయని, 33 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని, ఇప్పటికే అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారని తెలిపారు. ప్రతి అధికారి తమ కార్యాలయంలోని భవనం, రూఫ్‌టాప్, ఇతర అంశాలకు సంబంధించి ఫొటోలు అందించాలన్నారు. విద్యాశాఖ పరిధిలోని విద్యాలయాలు, సంక్షేమశాఖ హాస్టల్స్, పర్యాటక రిసార్ట్లు, అటవీ, పంచాయతీరాజ్ శాఖల కార్యాలయాలపై సోలార్ విద్యుత్‌ప్యానల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, జడ్పీసీఈవో దీక్షారైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

**ఖమ్మంలో నవంబరు మూడో వారంలో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు**


**రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పృథ్వీ, అనిల్**



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, అనిల్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను శాస్త్రీయ విద్యకు ప్రోత్సహించకుండా అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ పార్టీల సిద్ధాంతాలను పరోక్షంగా పాఠ్యపుస్తకాల్లో చేర్పించేందుకు నూతన విద్యా విధానాలను అమలులోకి తీసుకొస్తున్నాయని, వాటిని రద్దు చేసేందుకు పీడీఎస్‌యూ జాతీయస్థాయి వరకు పోరాటాలు చేస్తుందని, రాష్ట్రంలోను పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పోకడలనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, సాయిబొలా అనిల్ ఆరోపించారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్ అధ్యక్షతన రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వ విద్యా వ్యవస్థకు జీవం పోసే నిర్ణయాలు ప్రకటించారన్నారు. కానీ వాటిని ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. తెలంగాణ విద్యా కమిషనర్ ఆకునూరి మురళితో వెయించిన విద్యా కమిషన్, తిరుపతిరావు కమిషన్ నిర్ణయాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేయటంతో పరోక్షంగా ప్రైవేట్ విద్య బలోపేతం జరుగుతుందన్నారు. ఖమ్మంలో పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభలను నిర్వహించేందుకు రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. నవంబర్ మూడో వారంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీనర్సింహారావు, నరేందర్, అఖిల్‌కుమార్, సాయికుమార్, సురేశ్, లక్ష్మణ్, అంగిడి కుమార్, అలవాల నరేశ్, ముగనిగల శివ, అజయ్, నాగరాజు, అషూర్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెంపుడు కుక్క కోసం వెళ్లి.. వీధి కుక్క కాటుకు గురైన యజమాని


కుక్క కాటుతో గాయపడిన వెంకటేశ్వరరావు

వైరా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ నాల్గో వార్డులో వీధికుక్క దాడి నుంచి పెంపుడు కుక్కను కాపాడే ప్రయత్నంలో వీధికుక్క కాటుకు గురైన యజమాని ఉదంతమిది. విలేకరిగా పనిచేస్తున్న కొత్తా వెంకటేశ్వరరావు తన పెంపుడు కుక్కతో ఇంటి ఎదుట నిలబడి ఉండగా అకస్మాత్తుగా ఓ వీధికుక్క తన పెంపుడు కుక్కపై దాడి చేసింది. తన పెంపుడు కుక్కను కాపాడుకునే ప్రయ త్నంలో వెంకటేశ్వరరావును వీధికుక్క కరిచింది. దీంతో అతని కుడి చేతికి గాయమైంది. ఈ మేరకు అతను వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ వేయించుకున్న అనంతరం ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో మరో వ్యాక్సిన్ వేయించుకున్నట్లు తెలిపారు.

## గుండెపోటుతో యువరైతు హఠాన్మరణం


వెంకటనారాయణ రెడ్డి (ఫైల్)

తల్లాడ, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): ఓ యువరైతు గుండెపోటుతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివరాలు ఇలా తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన యువరైతు వేమిరెడ్డి వెంకట నారాయణరెడ్డి (33) గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇతనికి వ్యవసాయంపై మంచి పట్టున్న రైతుగా గుర్తింపు ఉంది. అతని మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

# చిరునోములలో వరుస చోరీలు

**ఇంట్లో 3తులాల బంగారం, నగదు అపహరణ**


చోరీ జరిగిన ఇంట్లో విచారణ నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకన్న

బోనకల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి వరుస చోరీలు జరగడం మండలంలో కలకలం రేపింది. ఓ ఇంట్లో చొరబడిన దొంగలు బంగారు నగలు, కొంత నగదును దోచుకెళ్లారు. అదే గ్రామంలోని ఓ రైతు పొలంలో సోలార్ సిస్టం, స్టార్టర్ బాక్సులను చోరీ చేశారు. ఈ సంఘటనలపై బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ పొదిలి వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. చోరీ జరిగిన ఇంటితో పాటు, పొలంలో చోరీకి గురైన సోలార్ సిస్టంల వద్దకు ఎస్ఐ వెళ్లి విచారణ నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిరునోముల క్రాస్‌రోడ్డు వద్ద గల పాపబత్తిని ఇసాక్ మూడు రోజుల క్రితం వేరే ఊరికి వెళ్లగా, అతని నాయనమ్మ లక్ష్మి ఒంటరిగా ఉంటుంది. కానీ ఆదివారం రాత్రి ఆమె కూడ చిరునోములలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఇది గమనించిన దొంగలు ఇంటి వెనుక తలుపునకు ఏర్పాటు చేసిన ఇనుప బేడాన్ని కట్ చేసి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళం కోసం వెతకగా పైన పెట్టి ఉండటంతో దొరికింది. దీంతో సులువుగా బీరువాను తీసి చోరీ చేశారు. సోమవారం ఇంటికి రాగా, ఇంటి వెనుక తలుపు తీసి ఉండటంతో పాటు బీరువాలో ఉన్న వస్తువులు కనబడక పోవడంతో చోరీ జరిగిందని గుర్తించిన ఇంటి యజమాని ఇసాక్ పోలీసులను ఆశ్రయించారు. బీరువాలో ఉన్న 3 తులాల బంగారపు చంద్రహారం, 5 తులాల పట్టీలు, కొంత నగదు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. క్లూస్ టీం ఇంటిని సందర్శించి వేలి ముద్రలను సేకరించారు.

**పొలంలో సోలార్ సిస్టం, మోటర్ స్టార్టర్ బాక్సుల చోరీ**


చోరీకి గురైన సోలార్ ప్యానల్ ఇదే

చిరునోముల గ్రామంలోని శాఖమూరి శ్రీరామ్ పొలంలో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం, మోటర్ స్టార్టర్ బాక్సులను దొంగలు చోరీ చేశారు. విద్యుత్ వైర్లను కట్ చేసి, సోలార్ ప్యానల్‌ను పగులగొట్టారు. రూ.30 వేల విలువ చేసే సామగ్రి చోరీకి గురైందని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడు నెలల క్రితం కూడా ఇదే పొలంలో చోరీ చేశారు. వరుస చోరీలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు.

## హత్య కేసు నిందితుల అరెస్టు

**వివరాలు వెల్లడించిన సీఐ నాగరాజు**

బూర్గంపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన రాత్రి జరిగిన దాడి ఘటనలో బూర్గంపాడు పోలీసులు ఇరువురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్వంచ ఇన్‌చార్జ్ సీఐ నాగరాజు వివరాలను వెల్లడించారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన కడియం సర్వేశరరావు(32) అనే యువకుడు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన రాత్రి బూర్గంపాడు మండల పరిధిలోని మోతె గ్రామంలో గల తన స్నేహితుడు ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. అదే రోజు అర్ధరాత్రి సమయంలో... సర్వేశరరావు టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చర్లపల్లి శివ అనే వ్యక్తి ఇంటి దగ్గర నుంచి చెప్పకుండా గ్యాస్ సిలిండర్ తెచ్చాడనే కారణంతో శివతో పాటు మరో వ్యక్తి కొండల సంతోష్‌తో కలిసి మోతె గ్రామానికి చేరుకుని సర్వేశరరావుపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. సిమెంట్ డంబెల్‌తో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఈ నెల 16వ తేదీన మృతి చెందాడు. మృతుడి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మేడా ప్రసాద్ కేసు నమోదు చేయగా సీఐ నాగరాజు దర్యాప్తు చేపట్టారు. ఇరువురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ మేడా ప్రసాద్, ట్రైనీ ఎస్ఐ దేవ్‌సింగ్, హెడ్ కానిస్టేబుల్ స్వామి పాల్గొన్నారు.

## హత్యకేసులో జీవితఖైదు

ఖమ్మం లీగల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామానికి చెందిన బాలంటూ నాని కి జీవిత ఖైదు శిక్షతో పాటు పది వేల రూపా యల జరిమాన విధిస్తూ ఖమ్మం రెండవ అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి వెంపటి అపర్ణ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, మద్యానికి అలవాటు పడిన నిందితుడు బాలంటూ నాని అదే గ్రామానికి చెందిన తేలూరి రమేష్ అనే వ్యక్తిని డబ్బులు కోసం బెదిరిం చాడు. డబ్బులు ఇవ్వకపోవటంతో మనసు లో కక్ష పెంచుకున్నాడు. అదును కోసం ఎదురుచూసిన నాని హత్య చేసేందు కు 12 జనవరి 2023న కూరగాయలు కోసే కత్తితో దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన తేలూరి రమేష్‌ను చికిత్స నిమిత్తం స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. చికిత్స పొందుతూ రమేష్ మృతిచెందాడు. మృతిని సోదరుడు తేలూరి వీరబాబు ఫిర్యాదు మేరకు రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితుడని అరెస్టు చేశారు. కేసును దర్యాప్తు పూర్తిచేసి అభియోగ పత్రాన్ని న్యాయస్థానంలో సమర్పించగా కేసును విచా రించిన న్యాయాధికారి నేరం రుజువు కావ టంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పా రు. ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాది ఏ. శంకర్ కేసును వాదించగా కోర్టులైజన్ ఆఫీసర్ కె.శ్రీకాంత్(ఎస్ఐ), కోర్టు కానిస్టేబుల్ యు. సాంబశివరావు, డి.నాగేశ్వర రావు, హోంగార్డ్ ఎండి.యూసుఫ్‌లు సహకరించారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఖమ్మంక్రైం, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గాయపడిన యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. ఖానాపురం హవేలీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నగరంలో గోపాలపురం ప్రాంతంలో ఇటీవల రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ విషయం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దేవేందుల కార్తీక్(30) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ కేసులో 11 మందిని నిందితులుగా ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఖానాపురంహవేలి పోలీసులు కేసు నమోదు చేయగా వారిలో ఏడుగురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపారు. వీరిలో ఇద్దరు పరారీలో ఉండగా మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో తీవ్ర గాయాలు భారిన పడిన కార్తీక్ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ఈ గొడవకు కొంతమంది వ్యక్తులు ప్రేరేపించడమే మృతికి కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా గతంలో నమోదైన కేసు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం..

**రూ.4 లక్షల ఆస్తినష్టం**

సత్తుపల్లిరూరల్, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ చార్జర్ పేలడంతో స్విచ్‌బోర్డు నుంచి సిలింగ్‌కు వరకు మంటలు వ్యాపించిన సంఘటన సత్తుపల్లి పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. సత్తుపల్లి అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ పక్కన మామిళ్లపల్లి కాంప్లెక్స్‌లోని పై అంతస్తులో నివాసం ఉంటున్న మనోవైభవ్ అస్లాం ఇంటిలో ఫోన్‌కు చార్జింగ్ పెట్టగా చార్జర్ పేలి మంటలు వ్యాపించడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగిందని తెలిపారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


అనిల్‌కుమార్ (ఫైల్)

ఖమ్మం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కరుణగిరి ప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరుణగిరి ప్రాంతానికి చెందిన దేవరకొండ వెంకట అనిల్‌కుమార్ (35) వాటర్ ప్లాంట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం వాటర్‌ప్లాంట్ వద్దకు వెళ్లేందుకు స్నానం చేసేందుకు హీటర్‌తో వేడినీళ్లు పెట్టుకోగా ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శైలజ, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## రోడ్డుప్రమాదంలో యువకుడి దుర్మరణం

తిరుమలాయపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన గుర్రాల రమేష్(41) వ్యవసాయకూలీగా జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి బస్టాండ్ నుంచి ఇంటికి వస్తుండగా రోడ్డుదాటే క్రమంలో ఖమ్మంవైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో అతనికి బలమైన గాయాలు కావడంతో తిరుమలాయపాలెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు మృతుని తల్లిదండ్రులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

**కుమార్తెను దింపడానికి వెళ్తూ ప్రమాదంలో...**

మధిర రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం మధిర మండలం కృష్ణాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. సిరిపురం గ్రామానికి చెందిన కనకపూడి నర్సింహారావు(55) పెట్రోల్ బంకులో పనిచేస్తున్న తన కుమార్తెను మధిరకు ద్విచక్రవాహనంపై తీసుకొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో మధిర నుంచి ఖమ్మం వైపు కారులో వెళ్తున్న ఓ వైద్యుడు ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సింహారావు అక్కడికక్కడే మృతిచెందాడు. అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## వివాహితపై అత్యాచారయత్నం

చింతకాని, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన కే జగంధీర్ ఆదివారం రాత్రి అత్యాచారయత్నం చేయబోయాడు. స్థానికుల సమాచారం మేరకు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో బలాత్కరించబోగా ఆమె కేకలు వేయడంతో పరారయినట్లు తెలిపారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## 21న అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల21న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్- 14, 16, 18, 20 విభాగంలో అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్‌అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి ఈనెల 30, 31 తేదీలలో మహబూబ్‌నగర్ జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో స్టేడియానికి చేరుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

### సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సురేష్

ఖమ్మంరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవ్వాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పల్లెగూడెంలో సోమవారం నిర్వహించిన సీపీఐ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఏదులాపురం మునిసిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలం సీపీఐకి బలమైన కేంద్రాలు అన్నారు. కలిసివచ్చే అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ సంస్థాగతంగా బలోపేతం అయ్యేలా విస్తరణ వైపు ప్రయత్నం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, జిల్లా సమితి సభ్యులు లింగ వెంకటనారాయణ, శంకరయ్య, వీరభద్రం, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, రాంమూర్తి, కిషన్ రావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు మరిన్ని అవార్డులు రావాలి

### నేలకొండపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు



ఎంపీడీఓ ఎర్రయ్యను సన్మానిస్తున్న తహసీల్దార్

నేలకొండపల్లి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ ఎర్రయ్యకు ఉత్తమ ఉద్యోగిగా అవార్డు రావటం సంతోషమని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు రావాలని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు పొందిన నేలకొండపల్లి ఎంపీడీఓ ఎర్రయ్యను సోమవారం ప్రజావాణిలో అధికారులు శాలువాతో సత్కరించారు. ఎంపీడీఓ చేసిన సేవలను కొనియాడారు. అవార్డులు రావటం అధికారులు, సిబ్బందిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. ఉత్సాహంగా తమ విధులను నిర్వహించటానికి తోడ్పడుతుందన్నారు. ఎం.రాధ, ఎంఈవో బాలిన చలపతిరావు, పలువురు ఉద్యోగులు ఎంపీడీఓను సన్మానించిన వారిలో ఉన్నారు.

## 25న ఆశా కార్యకర్తల కలెక్టరేట్ ముట్టడి

వైరా,ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారానికి ఈనెల 25న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. తమ సమస్యలను వివరిస్తూ సోమవారం వైరాపీహెచ్‌సీ డాక్టర్ శ్రీహర్షకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈనెల 19న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట ధర్నా, 25న కలెక్టరేట్ ముట్టడి, వచ్చేనెల ఒకటోతేదీన ఛలోహైదరాబాద్ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు. అప్పటికీ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని సీఐటీయూ పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

## నాగులవంచ సబ్‌స్టేషన్‌కు పమ్మి 33కేవీ లైన్ అనుసంధానం

చింతకాని, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ సబ్‌స్టేషన్‌కు ముదిగొండ మండల పమ్మి నుంచి వచ్చే 33 కేవీ లైన్‌ను అనుసంధానించినట్లు సంస్థ ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. సోమవారం నాగులవంచ సబ్‌స్టేషన్ నూతన ప్రత్యామ్నాయ లైన్‌ను ఆయన చార్జ్ చేసి ప్రారంభించారు. ఇప్పటి వరకు నాగులవంచ సబ్‌స్టేషన్‌లో ప్రత్యామ్నాయ లైన్ లేదన్నారు. పమ్మి లైన్‌ను అనుసంధానించడం ద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డీఈ నంబూరి రామారావు, డీఈ టెక్నికల్ బాబూరావు, డీఈలు పాల్గొన్నారు.

## కల్లూరు పల్లెదవాఖానాలో పీహెచ్‌సీ సేవలు ప్రారంభం

కల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని సీహెచ్‌సీ పరిధిలో అనుసంధానంగా వైద్య సేవలు అందిస్తున్న పీహెచ్‌సీని స్థానిక ఎన్నెస్పీ క్యాంపులో గల పల్లె దవాఖానకు తరలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు సోమవారం చేపట్టారు. గతంలో పీహెచ్‌సీ ఉన్న పాత భవనంలోనే మూడేళ్ల క్రితం నుంచి సీహెచ్‌సీ వైద్య సేవలు అందిస్తున్నారు. ఇలా భవనాల వసతి సౌకర్యం లేక ఒకే భవనంలో రెండు రకాలుగా సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్య సేవలు అందించడంతో రోగుల్లో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. ఇలా మందులను, సామగ్రిని పూర్తి స్థాయిలో తరలింపు ప్రక్రియను చేపట్టగా, ఇకపై పీహెచ్‌సీ వైద్య సేవలు ఇక్కడే కొనసాగుతాయిని ప్రభుత్వ వైద్యాధికారి నవ్యకాంత్ తెలిపారు.

# రోడ్లను మింగేస్తున్న ర్యాంపులు

- డ్రెయినేజీల మీదుగా మెట్లతో నిర్మాణాలు
- వరద, వర్షపు నీరు దారి లేక నివాసాల్లోకి..
- 57వ డివిజన్‌లో నిర్మాణాలపై కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదులు





రోడ్డు ఆక్రమించి నిర్మించిన ర్యాంపులు

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇళ్ల నిర్మాణదారులు రహదారులు ఆక్రమించి ర్యాంపులు నిర్మిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో 57వ డివిజన్‌లోను నివాసాల ఎదుట ర్యాంపుల నిర్మాణాలపై స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలో పేరుకే 30అడుగులు అంతర్గత రహదారులు ఉన్నా.. ఒక వాహనాన్ని తప్పించి మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నగరంలోని 6వ డివిజన్‌లో ఇటీవల కాలంలో భవనాలు నిర్మాణాలు భారీగా జరుగుతున్నాయి. ఖానాపురం నుంచి ప్రశాంతినగర్, కృష్ణుడి దేవాలయం ఇలా ప్రతీవీధిలో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. బిల్డర్లు భవనాలను ఎత్తుగా నిర్మాణం చేసి, రహదారులను ఆక్రమించి ర్యాంపుల నిర్మాణం చేస్తున్నారు. ఈ ర్యాంపులు డ్రెయినేజీలను దాటి మరోమూడు నుంచి నాల్గుఅడుగుల వరకు ప్రధాన రహదారును ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారు. ముఖ్యంగా ఖానాపురం హావేలిలోని ఆదర్శనగర్‌లో జితేందర్ మెడికల్ షాప్ నుంచి లోపలి వరకు ఇష్టారీతీగా ర్యాంపులను నిర్మాణం చేశారు. ఉద్యోగులు ఎక్కువగా ఉండే ప్రాంతం కావటంతో కార్లు, ద్విచక్ర వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. పాతభవనాలతో పాటుగా కొత్తగా నిర్మాణాలు జరిగే భవనాలు సైతం ర్యాంపులు ఎక్కువ ఎత్తులో నిర్మాణాలు చేస్తున్నారు.

### కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన 57వ డివిజన్ ప్రజలు

57వ డివిజన్‌లోను నివాసాల ఎదుట ర్యాంపుల నిర్మాణాలు చేయటంతో వర్షపు వరదనీరు సజావుగా పోవటం లేదని, నీరు నిల్చి తమ నివాసాలపైకి వస్తున్నాయని రమణగుట్ట ప్రాంతానికి చెందిన ప్రజలు కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫిర్యాదులు చేశారు. డ్రెయినేజీలపై ర్యాంపులు నిర్మాణాలు చేయటమే పెద్దసమస్యగా మారిందన్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని ఆరోపించారు. పలు ర్యాంపు నిర్మాణాలను కమిషనర్‌కు సెల్‌ఫోన్ చూపించారు. నగరవ్యాప్తంగా ఇదే సమస్యపై ప్రజలు అనేక పర్యాయాలు ప్రజావాణిలో కమిషనర్‌కు పట్టణ ప్రణాళిక అధికారులకు ఫిర్యాదులు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ర్యాంపులు నిర్మాణాలపై పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధరను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ర్యాంపుల నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రత్యేకడ్రైవ్ చేపట్టి తొలగిస్తామన్నారు.



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

## పీజీ కళాశాలలో జాబ్‌మేళా



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో విద్యార్థులకు ఐటీహబ్ కు చెందిన సాఫ్ట్ వేర్ కంపెనీ టెక్ స్కై ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. మేనేజర్ సైదేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ చేకూరి రవికుమార్ సమక్షంలో నిర్వహించిన ఈ ఎంపికలకు పీజీ, బీపీఈడి కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. విడతల వారిగా ఇంటర్వ్యూలు నిర్వహించి నైపుణ్యం, అర్హతలు కలిగిన పలువురిని రిక్రూటర్లుగా ఎంపిక చేశారు. వీరికి స్థానిక ఐటీ హబ్‌లో చివరి దశ ఎంపికలు ఉంటాయని మేనేజర్ సైదేశ్వర్ తెలిపారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. సేల్స్ మెన్ సమీర్, హెచ్‌ఆర్‌లు రవితేజ, దుర్గాప్రసాద్, పృథ్వీ, అనుదీప్, సురేష్, హసీనా, హరికృష్ణ, అధ్యాపకులు లక్ష్మీ హరిత, వీరాంజనేయులు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### వ్యవసాయ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్

ఖమ్మంమార్కెట్,ఆగస్టు18(ఆంధ్రజ్యోతి):జిల్లాలో యూరియా కొరతలేదని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, పోలీసు అధికారులతో ఆయన సమీక్షించారు. గత సంవత్సరం కంటే అదనంగా 3,250 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని అన్నారు. ప్రస్తుతం 2700 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. రైతులు ప్రస్తుత అవసరాలకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. ఎకరం భూమికి బస్తా యూరియా వేయాల్సి వస్తే ఒకేసారి వేయకుండా 15 రోజులలో 2దఫాలుగా యూరియా చల్లడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని, దీనిపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కల్లూరు, తల్లాడ ప్రాంతంలో మరింత మానిటరింగ్ అవసరమని అన్నారు. ఏఈఓలతో సమన్వయం చేసుకుంటూ లైన్లు లేకుండా సజావుగా యూరియా అమ్మాలని అన్నారు. రైతులు చెప్పులు లైన్‌లో చెప్పులు పెడుతున్నారనే పరిస్థితి ఉంటే సంబంధిత సొసైటీ అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు నిర్దేశించిన టైమ్‌లో వచ్చి 10నుంచి 15 నిమిషాలలో యూరియా తీసుకొని వేళ్లేలా ఉండాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఒక చోట అధిక సంఖ్యలో రైతులు యూరియా కోసం వస్తే ఇతర ప్రాంతాల నుంచి స్టాక్ తీసుకొచ్చి తక్షణమే పంపిణీ చేయాలని అన్నారు. యూరియా అందుబాటులో ఉన్నా కొంతమంది తప్పుడు ప్రచారాలు చేసి రైతులతో ధర్నా చేయించాలని చూస్తున్నారని, ఇది సరికాదన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, సహకార అధికారి గంగాధర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి నగదు పురస్కారం



గ్రేషితకు నగదును అందిస్తున్న ఎంపీడీవో ఎర్రయ్య

నేలకొండపల్లి, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో నేలకొండపల్లి మండలంలో ప్రథమస్థానంలో నిలిచిన సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని గ్రేషితకు సోమవారం ప్రజావాణిలో ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య నగదు పురస్కారాన్ని అందించారు. మండల విద్యాధికారి బాలిన చలపతిరావు తన మాతృమూర్తి శాంతమ్మ జ్ఞాపకార్థం ఏటా పదోతరగతిలో మండలంలో ప్రథమస్థానం పొందిన విద్యార్థికి రూ.10,116 అందిస్తున్నారు. దీనిలో భాగంగా 2024-25 విద్యాసంవత్సరంలో గ్రేషితకు ఎంపీడీఓ ఎర్రయ్య చేతుల మీదుగా ఎంఈఓ నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీఓ రాధ, ఎమ్మార్పీ ప్రసాద్ పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఘనంగా జయంతి వేడుకలు



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పాల్గొన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. పోరాట యోధుడు పాపన్న గౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని, వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. సమానత్వం, స్వాభిమానం కోసం 400 సంవత్సరాల క్రితమే గొంతెత్తిన మహనీయుడని కలెక్టర్ అనుదీప్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, బీసీ కులసంఘ నాయకులు కత్తి నెహ్రూగౌడ్, బీసీసంఘాల నాయకులు బొమ్మా రాజేశ్వరరావు, జి.శంకర్‌రావు, ఎస్.స్వరూప, ఎం.లింగయ్య, ఎస్.సురేష్, ఎ.కృష్ణ, డి.ఉపేందర్, జి.వెంకన్న, జి.ఎస్. వాసు, వెంకటప్పయ్య, జి.గోపగాని శంకర్‌రావు, బీసీకుల సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# కేఎంసీలో మళ్లీ గ్రూపు రాజకీయాలు

- కొత్తగ్యాంగ్‌తో ఉద్యోగుల మధ్య అగాథం
- షాడో పాలన చేస్తున్నవైనం



ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): కేఎంసీలో మళ్లీ గ్రూపు రాజకీయాలు ప్రారంభమయ్యాయి. కొందరు ఉద్యోగులు షాడో పాలన చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పరిపాలన గాడిలో పెట్టేందుకు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఏడాదిలో అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నోఏళ్లుగా కేఎంసీలోనే ఉన్న రెండు వర్గాల ఉద్యోగులను ఇతర మునిసిపాలిటీలకు పంపారు. వారు తిరిగి ఇక్కడకు వచ్చేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నా కమిషనర్ వాటికి అంగీకరించటం లేదు. దీంతో ఆయా వర్గాల నాయకులు ప్రస్తుతం కేఎంసీలో పని చేస్తున్న వారి అనుకూల ఉద్యోగులతో మళ్లీ విబేధాలు సృష్టిస్తున్నారు. ఆగస్టు 15 సందర్భంగా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పంపిణీ చేసిన ప్రశంస పత్రాలు వివాదానికి తెరలేపాయి. సుడా నుంచి కేఎంసీలో చేరిన ఓ కంప్యూటర్ ఆపరేటర్ తనకు అనుకూలంగా ఉండే 9మంది ఉద్యోగులకు ప్రశంసపత్రాలు ఇప్పించారని ఆరోపణ ఉంది. ఇందుకు కేఎంసీ ప్రజాప్రతినిధితో సిపారసులు చేశారని పెద్ద వివాదమే జరిగింది. కనీసం పని చేయని వారికి, గతంలో కమిషనర్ చర్యలు తీసుకున్న వారికే తిరిగి కమిషనర్ చేతులతో ప్రశంస పత్రాలు ఇప్పించారని మరోవర్గం ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకంగా ప్రశంసా పత్రాలు పంపిణీ జరగలేదని, కొంతమంది ఉద్యోగులు ప్రశంసాపత్రాలు తీసుకునేందుకు ముందుకు రాలేదు. కాగా ఇంజనీరింగ్ ఇతర విభాగాల్లో ఆరోపణలు వచ్చిన ఉద్యోగులను కమిషనర్ పారదర్శక పరిపాలన కోసం ఇతర విభాగాలకు మార్పులు చేశారు. ఐనా వారిలో మార్పు రాలేదని విమర్శలు వెలువడ్డాయి. కాగా మళ్లీ ఓ మహిళాఉద్యోగి ప్రజాప్రతినిధులతో సిపారసులు చేయించి తిరిగి పాత స్థానాలకు ఉద్యోగులను వెనక్కి పంపేందుకు కమిషనర్‌పై వత్తిడి తెప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. పక్షం రోజులుగా కేఎంసీలో ఇద్దరు ఉద్యోగుల తీరుపై మరోవర్గం ఉద్యోగులు ఆరా తీస్తున్నారు. పైరవీలు చేస్తూ కొత్త వర్గాలను ఏర్పాటు చేస్తున్న ఉద్యోగులను కేఎంసీ నుంచి జోనల్ కార్యాలయాలకు పంపాలని ఉద్యోగులు కోరుతున్నారు.

## జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు

ఖమ్మంక్రైం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): రాత్రివేళలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అరికట్టే దిశగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రత చర్యలు చేపడుతున్నారు. ఈక్రమంలో వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే ఫింగర్‌ప్రింట్, మొబైల్‌చెక్ ద్వారా వేలిముద్రలు సేకరిస్తున్నారు. మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులపై కేసులు నమోదుచేసి న్యాయస్థానంలో హాజరు పరిచే విధంగా చర్యలు తీసకుంటున్నారు. జిల్లాలో పలుప్రాంతాల్లో బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి బారికేడింగ్, ప్రమాద సంకేతక సూచికబోర్డులు ఏర్పాటుచేసి ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 17వరకు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 10141 మంది వాహనదారులు పట్టుబడ్డారు.



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

## రెయిన్‌కోట్‌ల పంపిణీ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన ఖమ్మానికి పారిశుధ్య కార్మికులు విశేషంగా కృషి చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్‌లు పంపిణీ చేశారు. వర్షాకాలం సీజన్‌లో కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పనులు చేపట్టాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ అనిల్, పారిశుధ్యపర్యవేక్షకులు సాంబయ్య, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



రెయిన్ కోట్‌లు పంపిణీ చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

# ఏడాది నిరీక్షణకు తెర

- వితంతు పింఛన్ ఇప్పించిన ప్రజావాణి
- వృద్ధురాలి దీనస్థితికి మేయర్, కమిషనర్ స్పందన

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజాఫిర్యాదుల పరిష్కారానికి ఆదేశాలు ఇవ్వటమే కాదు. వెంటనే వాటిని అమలు చేసి చూపించారు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య. ప్రజావాణికి వచ్చిన ఓ వృద్ధురాలికి తక్షణమే వితంతు ఫించన్ మంజూరు చేశారు. నగరంలోని ప్రభుత్వ జిల్లా హాస్పటల్ వెనుకభాగంలో ముక్తి కృష్ణ ప్రభుత్వ చేయూత పింఛన్ పొందుతూనే ఏడాది క్రితం మరణించారు. కృష్ణ మరణించిన తర్వాత అతడి భార్య భారతమ్మకు వెంటనే వితంతు ఫించన్‌ను మంజూరు జరగాల్సిఉంది. కానీ ఏడాదిగా కేఎంసీ కార్యాలయానికి వృద్ధురాలు తిరుగుతూనే ఉంది. ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో సోమవారం ప్రజావాణికి వచ్చి మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యకు తన గోడు చెప్పుకొని కన్నీరు పెట్టింది. ప్రభుత్వ నిభందనల మేరకు భర్త పింఛన్ తీసుకుంటూ మరణిస్తే భార్యకు వెంటనే పింఛన్ మార్పు జరగని విషయం వెలుగలోకి రావటంతో పింఛన్ విభాగం ఉద్యోగులను కమిషనర్ ప్రజావాణికి పిలిపించి వివరణ కోరారు. వెంటనే ఆన్‌లైన్ చేసి పింఛన్ ఇచ్చేందుకు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు.ప్రజావాణికి వచ్చిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇతర ఫిర్యాదులపై కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులకు సిపారసులు చేశారు. ఆర్థిక పరమైన అంశాలు లేని వినతులను వారం లోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, ఏవో శ్రీనివాస రెడ్డి, టీఎంసీ పాల్గొన్నారు.



వృద్ధురాలి గోడు వింటున్న మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య

## పల్లెదవాఖానాలో పీహెచ్‌సీ సేవలు ప్రారంభం

కల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని సీహెచ్‌సీ పరిధిలో అనుసంధానంగా వైద్య సేవలు అందిస్తున్న పీహెచ్‌సీని స్థానిక ఎన్నెస్పీ క్యాంపులో గల పల్లె దవాఖానకు తరలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు సోమవారం చేపట్టారు. గతంలో పీహెచ్‌సీ ఉన్న పాత భవనంలోనే మూడేళ్ల క్రితం నుంచి సీహెచ్‌సీ వైద్య సేవలు అందిస్తున్నారు. ఇలా భవనాల వసతి సౌకర్యం లేక ఒకే భవనంలో రెండు రకాలుగా సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్య సేవలు అందించడంతో రోగుల్లో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. ఇలా మందులను, సామగ్రిని పూర్తి స్థాయిలో తరలింపు ప్రక్రియను చేపట్టగా, ఇకపై పీహెచ్‌సీ వైద్య సేవలు ఇక్కడే కొనసాగుతాయిని ప్రభుత్వ వైద్యాధికారి నవ్యకాంత్ తెలిపారు.

# నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

» ఆక్రమణదారుల నుంచి హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి » ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిర, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు నాణ్యతతో సత్వరమే పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మధిర మునిసిపాలిటీ లో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు మధిర పట్టణ సమగ్ర అభివృద్ధిపై మునిసిపల్ ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి నెలకు ఓ సారి మునిసిపల్ ఈఎన్‌సీ, ప్రతి పదిహేను రోజులకు ఒక సారి సీఈ స్థాయి అధికారులు మధిర మునిసిపాలిటీలో జరిగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి వారం, పదిహేను రోజులు, నెల వారిగా టార్గెట్ పెట్టుకుని పనులు చేయాలని పనులకు సంబంధించిన వివరాలను పట్టణ ప్రజలకు సవివరంగా తెలియచేయాలని దీనిలో స్థానిక కౌన్సిలర్లను బాగస్వామం చేయాలని అన్నారు. భవిష్యత్‌లో మధిర పట్టణానికి తాగు నీటికి ఇబ్బందులు లేకుండా మిషన్ భగీరథకు ప్రత్యామ్నాయంగా జాలిముడి త్రాగునీటి పథకాన్ని సిద్ధం చేయాలని సూచించారు. హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమణ దారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడంతో మధిర వైకుంఠదామాన్ని జూబ్లీహిల్స్ వైకుంఠదామం తరహాలో అభివృద్ధి చేయాలని డంపింగ్ యార్డును మధిర పట్టణం నుండి తరలించాలని అన్నారు. మధిర మునిసిపాలిటీ నూతన భవన నిర్మాణ ప్రణాళికలు, ఎలివేషన్ పనులను సమీక్షించి పర్యాటక, ఆర్‌అండ్‌బి, మునిసిపల్ మూడు శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ట్యాంక్ బండ్, ఇతర నగర సుందరీకరణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీ శ్రీదేవి, పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ భాస్కర్ రెడ్డి, మధిర మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సమగ్ర వివరాలు పంపించండి: ఏపీడీ



దగ్ధమైన భవనాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ

ఏన్కూరు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ఏన్కూరులోని ఉపాధి హామీ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాద సంఘటనపై సమగ్ర వివరాలు పంపించాలని ఏపీడీ చలపతిరావు ఆదేశించారు. సోమవారం ఆయన ఉపాధి కార్యాలయాన్ని పరిశీలించారు. మంటల్లో కాలిపోయిన గదులను పరిశీలించారు. సమగ్ర నివేదిక అందించాలని ఏపీవో సూరయ్యను ఆదేశించారు. ప్రమాద సంఘటనపై కలెక్టర్ తోపాటు ఇతర అధికారులకు తెలిపామని ఎంపీడీవో జీవీఎస్ నారాయణ తెలిపారు.

## నీలాద్రీశ్వర దేవాలయంలో పూజలు

పెనుబల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నీలాద్రీశ్వర ఆలయంలో శ్రావణశుద్ధ దశమి సోమవారం కావడంతో భక్తులు శివుడికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు కోనేటిలో స్నానం ఆచరించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ ఈవో రజనీకుమారి తెలిపారు.

## దళితులకు భూ హక్కు చట్టాలు కల్పించాలి

ఏన్కూరు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాలనీనాచారం సర్వేనెంబరు 229లో 1975 నుండిసాగు చేసుకుంటున్న దళితులకు హక్కు పట్టాలు మంజూరుచేయాలని భూవారసులు సోమవారం తహసీల్దార్ శేషగిరిరావుకు వినతిపత్రం అందించారు. భూభారతి చట్టంలోనైనా తమ సమస్యలు పరిష్కరించాలని అట్టి భూమికి కొత్త పాసుపుస్తకాలు మంజూరుచేయాలని 229 సర్వేనెంబరు భూమిని సర్వేచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో భూవారసులు బాగం రమేష్, తడికమళ్ల నరసింహారావు, బాగం బెంజి, బాగం కృష్ణ పాల్గొన్నారు.

## ఎల్ఈడీ టీవీ అందజేత

ముదిగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం మల్లారం గ్రామానికి చెందిన కోలేటి రవి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు డిజిటల్ క్లాసులు బోధించేందుకు రూ.పదివేల విలువైన ఎల్ఈడీ టీవీని వితరణగా అందజేశారు. సోమవారం దాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయుడు సీతరాములు డిజిటల్ పాఠాలు బోధించారు. కోలేటి రవికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోలేటి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైభవంగా పోచమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీఎస్ సెంటినరీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ సింగరేణి పోచమ్మతల్లి, శ్రీ పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులకు అన్నప్రసాదం అనంతరం అమ్మవారికి బలి హారణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పోల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలి

చింతకాని, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చింతకాని మండల కేబుల్ ఆపరేటర్ల నుంచి విద్యుత్‌శాఖ అధికారులు వసూలు చేస్తున్న పోల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని కేబుల్ ఆపరేటర్ల సంఘ జిల్లా కార్యదర్శి దమ్మాలపాటి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలో జరిగిన కేబుల్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కేబుల్ ఆపరేటర్ల సంఘం చింతకాని అధ్యక్షుడు కందిమల్ల కృష్ణారావు, ఇనుకుల అనంతరెడ్డి, తిరుపతి వెంకయ్య, కోటపాటి రామదాసు, దమ్మాలపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి

కల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) వ్యవసాయ కార్మికుల పని భద్రత కోసం సమగ్ర కూలి చట్టం తీసుకురావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరులో వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ మహాసభ తన్నీరు కృష్ణార్జునరావు, పిల్లి నాగమణి, పులి కృష్ణయ్యల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదే విధంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ పన్నుల రూపంలో వచ్చిన దేశ సంపదను అంబానీ, ఆదానీలకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతుందని విమర్శించారు. ఈ మహాసభలో నాయకులు చలమల విఠ్రావు, మాదాల వెంకటేశ్వరరావు, సామినేని హనుమయ్య, జాజిరి శ్రీనివాస్, దోమతొట్టి పుల్లయ్య, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో భాగస్వాములైన జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ (2025-26) నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానిక చెర్రీస్ బంకెట్‌హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షప్రధాన కార్యదర్శులుగా తోట కిరణ్, జమ్ముల రాజేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా యనమాల విజయ్, చీపు గంగాధర్, కోశాధికారిగా కొవ్వూరి సాంబశివరావు, కాకర్ల జగన్, సహాయ కార్యదర్శులుగా నల్లంటి మోహన్, బండి వేల్పాద్రి, ప్రచార కార్యదర్శిగా కొత్తపల్లి సుధాకర్, గౌరవ అధ్యక్షులుగా మాదిరాజు సుధాకర్, భీమిశెట్టి రాము, ఎండీ. షైబుద్దీన్, రామిశెట్టి లక్ష్మణరావు, చీనేని బాలకృష్ణ, గౌరవ సలహాదారులుగా బల్లెం చిరంజీవి, తడికమళ్ల దేవదానం, నరుకుళ్ల రాము ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జీడిమళ్ల శ్రీనివాస్, కొర్రా బాలాజీ, బండారు ఉమా, విష్ణు, బాజీ, మీరా, ఒబిలిశెట్టి రామారావుపాల్గొన్నారు.

### ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ వాడటం ఉత్తమం

సత్తుపల్లి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని తలపెట్టని సౌకర్యవంతంగా ఉండే ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ వాడటం ఉత్తమమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. పట్టణానికి చెందిన ఏ ఇన్నోవేషన్స్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన శానిటరీ ప్యాడ్స్ ఉత్పత్తులను స్థానిక చెర్రీస్ బంకెట్ హాల్‌లో సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ జంగం అశ్విని, ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, సీడీపీవో మెహరున్నీబేగం, తోట సుజలారాణి, స్వచ్ఛంద సంస్థ బాధ్యులు కొనకళ్ల సుధారాణి, గాదె నరసింహారెడ్డి, కామెర క్రాంతి, వలపర్ల రవి, ఇనపనూరి రాధాకృష్ణ, జొన్నలగడ్డ రాజా, జంగా సత్యనారాయణ, గట్టే వాసు, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా తదితరులున్నారు.

## సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



వైరాలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బొర్రా రాజశేఖర్

వైరా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైరాలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్సా రవి, పెద్దప్రోలు లక్ష్మయ్య, బి.నర్సింహారావు, ధర్మారావు, వాసు, రామకృష్ణ పాల్గొన్నారు.

పెనుబల్లి: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. వీఎంబంజర్‌లో బహుజనుల సాంకేతికంగా జెండాను విగ్రహ దాత వేముల నర్సింహారావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు టి.రాజారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, వంగా గిరిజాపతిరావు, బజ్జూరి నాగేశ్వరరావు, మల్లెల శ్రీనివాసరావు, గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, వేముల కృష్ణయ్య, మండల అధ్యక్షుడు ఈడా కమలాకర్ రావు, బొర్రా వెంకటేశ్వర్లు, వేముల రవికుమార్ వంగా దామోదర్‌రావు, బాబూనాయక్, తదితరులు పాల్గొన్నారు.



తల్లాడలో...

తల్లాడ, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని సోమవారం తల్లాడలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్ర పటానికి గౌడ సంఘం సీనియర్ నేత నాసగోని సురేష్ బాబు పూలమాలలువేసి నివాళులర్పించారు ఈకారయక్రమంలో సర్దార్ పాపన్నగౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల గోపిగౌడ్, నాయకుఉల మొక్క బసవయ్య, కృష్ణార్జున్, సత్యం, కొంగల దాసు, రామకృష్ణ పాల్గొన్నారు.

బోనకల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, యువ నేత బీపీ నాయక్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా సైదా నాయక్, తోటపల్లి స్వామి, బండి వెంకటేశ్వర్లు, గాలి రాము, నందమూరి సత్యనారాయణ, యార్లగడ్డ శ్రీనివాసరావు, తెలుకులపల్లి సాంబయ్య, బొబిళ్ల నర్సింహారావు, కృష్ణయ్య, అంజి, దర్శ, పవన్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదు తీసుకునే అధికారులేరీ?

» ప్రజావాణిలో సీపీఐ నాయకుల ఆవేదన

కొణిజర్ల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో సమస్యలపై సోమవారం ఫిర్యాదు చేసేందుకు వస్తే అధికారులు మాత్రం 12గంటల వరకు రాలేదని సీపీఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు అన్నారు. ప్రజావాణి వద్ద ఆయన మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా లేక విషజ్వరాలు వస్తున్నాయని, దీనిపై అధికారులకు తెలిపేందుకు వస్తే అధికారులే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సమస్యల మీద వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రజావాణిని నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, యాసా వెంకటేశ్వరరావు, వెంకటి, పొట్లపల్లి సీతరాములు, నరసింహరావు, తోటపల్లి సీతరాములు, శ్రీను, రామయ్య, గుమ్మిడెల్లి సైదారావు తదితరులున్నారు.



ప్రజావాణికి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన సీపీఐ నాయకులు

## కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో పువ్వాళ్ల, పోట్ల

ముదిగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముదిగొండ మండలం అయ్యగారిపల్లిలో బీఆర్ఎస్ పార్టీ నుంచి 35కుటుంబాల వారు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీలు బులెట్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, ఆదినారాయణరెడ్డి, రమేష్, భద్రారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేశ్వరరావు, రాఘవ పాల్గొన్నారు.

## 25న ఆశాల కలెక్టరేట్ ముట్టడి

వైరా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25వతేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. తమ సమస్యలను వివరిస్తూ సోమవారం వైరా పీహెచ్‌సీ డాక్టర్ శ్రీహర్షకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు శైలజా, రేణుక, దీప, హైమావతి, మహేశ్వరి, లలిత పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల ఆశాకార్యకర్తలు తమ సమస్యలు పరిష్కారానికి నేడు ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రశాంత్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమం లో సీఐటీయూ నాయకుడు సగ్గుర్తి సంజీవరావు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగులవంచ సబ్‌స్టేషన్‌కు పమ్మి 33కేవీ లైన్ అనుసంధానం: ఎస్ఈ



మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

చింతకాని, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ సబ్‌స్టేషన్‌కు ముదిగొండ మండల పమ్మి నుంచి వచ్చే 33 కేవీ లైన్‌ను అనుసంధానించినట్లు సంస్థ ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. సోమవారం నాగులవంచ సబ్‌స్టేషన్ నూతన ప్రత్యామ్నాయ లైన్‌ను ఆయన చార్జ్ చేసి ప్రారంభించారు. ఇప్పటి వరకు నాగులవంచ సబ్‌స్టేషన్‌లో ప్రత్యామ్నాయ లైన్ లేదన్నారు. పమ్మి లైన్‌ను అనుసంధానించడం ద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డీఈ నంబూరి రామారావు, డీఈ టెక్నికల్ బాబూరావు, డీఈ బద్రుపవర్, నాగేశ్వరరావు, ఏడీఈలు తిలక్, కిరణ్‌చక్రవర్తి, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతిక సమస్యలను నివారించాలి

» తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఏన్కూరు/తల్లాడ, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో సాంకేతిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయా సొసైటీ కార్యాలయాల్లో యూరియా పంపిణీని పరిశీలించారు. అనంతరం ప్రజాసంఘాల భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో నాయకులు గుండా సత్యనారాయణరెడ్డి, యనమద్ది రామకృష్ణ, మహేష్, నాగేశ్వరరావు, రేగళ్ల సత్యం, గుంటుపల్లి వెంకటయ్య, అయినాల రామలింగేశ్వరరావు, రావూరి అప్పారావు, యలమంచి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆమ్‌ఆద్మీ నేతలను విడుదల చేయాలి

కొణిజర్ల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లు ఆమోదం కోసం చలో రాజ్‌భవన్‌కు వెళ్తున్న ఆమ్‌ఆద్మీ నేతలను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని ఖమ్మం జిల్లా ఆప్ అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయనను కూడా కొణిజర్ల పోలీస్‌లు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఆప్‌మీడియా ఇన్‌చార్జి సంగమేశ్వరప్రసాద్‌ను, గుత్తా నాగేశ్వర్‌ను, పసుమర్తి శ్రీనివాస్ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

## పెనుబల్లి ఫొటోగ్రాఫర్‌కు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ పొందిన చిత్రం

పెనుబల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఎగ్జిబిషన్ పోటీల్లో పెనుబల్లి మండలం పాత కారాయిగూడెం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ కొప్పుల గోపాలరావుకు ప్రతిష్ఠాత్మక సర్టిఫికెట్ మెరిట్ అవార్డు-2025తోపాటు బంగారు పతకం లభించింది. ఈ అవార్డును సోమవారం ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఉపాధ్యక్షుడు కొంపెల్లి సుందర్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి, మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజులు కొప్పుల గోపాలరావుకు అందజేశారు.



అవార్డు అందుకుంటున్న గోపాలరావు

## మట్టిపార.. చిత్రం మధురం

ఎర్రుపాలెం, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): నేల, నీరు, రైతు కలిస్తేనే భూమిపండుతుంది. ఈదేశానికి అన్నం పెట్టే రైతన్న నేలను విడవకుండా సాము(వ్యవసాయం) చేస్తేనే దేశం కడుపు నిండుతుంది. ఎర్రుపాలెం మండలం జమలాపురంలో నాటుకు సిద్ధమవుతున్న ఓ మాగాణిలో సాయంత్రం వేళ నేలకు, మట్టిపార మధ్య ప్రేమ చిగురిస్తున్న ప్రకృతి చిత్రరువుని ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

